

## మిథునం

మృగశిర 3,4 ఆరుద్ర, పునర్వసు 1,2,3 పాదాలు
**ఆదాయం: 5 వ్యయం: 5**
**రాజపూజ్యం: 3 అవమానం: 6**

**చైత్రం:** ఆదాయం స్థిరంగా ఉంటుంది. ఉద్యోగులకు పై అధికారుల మద్దతు లభిస్తుంది. అనవసరమైన ఖర్చుల వల్ల మనశ్శాంతి లోపించవచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు తాత్కాలికంగా ఫలిస్తాయి.

**వైశాఖం:** ఈ నెలలో గ్రహస్థితి కొంత అనుకూలంగా ఉంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. భక్తి పెరుగుతుంది. బంధు మిత్రులతో పనులు నెరవేరుతాయి. ఆత్మీయుల సలహాలను పాటిస్తారు. ప్రారంభించిన పనులను శ్రద్ధతో పూర్తి చేస్తారు.

**జ్యేష్ఠం:** రావలసిన డబ్బు వస్తుంది. బాకీలు తీర్చి ప్రశాంతంగా ఉంటారు. ఉద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది. అధికారులతో సఖ్యత ఏర్పడుతుంది. ఆదాయం క్రమేణా పెరుగుతుంది. గృహ నిర్మాణ కార్యక్రమాలు చేపడతారు. భూమి కొనుగోలు కలిసి వస్తుంది.

**ఆషాఢం:** అనవసరమైన ఖర్చులు ముందుకు రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావచ్చు. వాహన మరమ్మతులు ముందుకురావచ్చు. బంధుమిత్రులతో పనులు నెరవేరుతాయి. ఖర్చుల నియంత్రణతోపాటు ఆదాయ మార్గాలపై మనసు నిలపడం అవసరం.

**శ్రావణం:** విద్యార్థులు శ్రమించ వలసిన సమయం. ఉద్యోగులకు పనిచేసే చోట పరపతి పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. వివాదాలకు దూరంగా ఉండడం మంచిది. అనవసరమైన ఆలోచనలను పక్కన పెట్టి, పనులపై మనసు నిలపడం మంచిది.

**భాద్రపదం:** ఈ నెల అన్ని విషయాల్లో జాగ్రత్త పాటించడం అవసరం. అశ్రద్ధ మూలంగా నష్టాలు ఎదురుకావచ్చు. మనశ్శాంతి కరువవుతుంది. ఓపికతో ముందుకు వెళ్లడం అవసరం. బంధువులు, స్నేహితులతో పనులు నెరవేరినప్పటికీ, మనస్పర్ధలు తలెత్తవచ్చు.

**ఆశ్వీయుజం:** వ్యాపారులకు భాగస్వాములతో అభిప్రాయ భేదాలు తలెత్తవచ్చు. ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తారు కుటుంబంతో సంతోషంగా కాలం గడుపుతారు. ఆదాయం పెంచుకొనే మార్గాలను అన్వేషిస్తారు.

**కార్తీకం:** ప్రారంభించిన పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. ఆర్థిక ఒప్పందాలలో ఏమరుపాటు తగదు. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఘూలావాదేవీల్లో జాగ్రత్తగా ఉండండి.

**మార్గశిరం:** ఆరోగ్యం బాగుంటుంది. వ్యాపారులకు కాలం కలిసి వస్తుంది. సహోద్యోగులతో స్నేహం కుదురుతుంది. మిత్రులతో పనులు నెరవేరుతాయి. బాధ్యతలు శ్రద్ధతో పూర్తిచేస్తారు.

**పుష్యం:** విద్యార్థులు శ్రమకు తగిన ఫలితం పొందుతారు. కుటుంబ పెద్దల సహకారం లభిస్తుంది. అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు తీసుకుంటూ ఆలోచించి పనిచేయడం మంచిది.

**మాఘం:** మాట పలుకుబడి పెరుగుతుంది. ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతారు. విద్యార్థులకు అనుకూల సమయం. ఆదాయం స్థిరంగా ఉంటుంది. అయితే అనవసరమైన ఖర్చులు ముందుకు వస్తాయి.

**ఫాల్గుణం:** ప్రారంభించిన పనులను నిర్ణీత సమయంలో పూర్తిచేస్తారు. ఆదాయం స్థిరంగా ఉంటుంది. సోదరులు, బంధువుల సహకారం లభిస్తుంది. స్థిరాస్తి ద్వారా ఆదాయం వస్తుంది.

**** ఈ రాశివారికి గురువు లాభంలో (ఏప్రిల్ 31 వరకు), సంవత్సరం పూర్తయ్యే దాకా వ్యయంలో ఉంటాడు. భాగ్యంలో శని, రాజ్యంలో రాహువు, చతుర్థంలో కేతువు సంచరిస్తారు. గురువు, శని అనుకూల ఫలితాలు ఇస్తారు. రాహుకేతువులు మిశ్రమ ఫలితాలు ఇస్తారు. సుబ్రహ్మణ్యస్వామి ఆరాధనతో శుభఫలితాలు పొందుతారు.***



## కర్కాటకం

పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష
**ఆదాయం: 14 వ్యయం: 2**
**రాజపూజ్యం: 6 అవమానం: 6**

**చైత్రం:** పట్టుదలతో పనిచేయడం అవసరం. ఖర్చులను దృష్టిలో పెట్టుకోవాలి. ఉద్యోగంలో మంచి అవకాశాలు వస్తాయి. ఇంట్లో వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ఆదాయ మార్గాలపై మనసు నిలుపుతారు.

**వైశాఖం:** అనాలోచిత నిర్ణయాల వల్ల పనుల్లో జాప్యం ఏర్పడుతుంది. ఆరోగ్యంపై మనసు నిలుపుతారు. రుణ భారం పెరుగుతుంది. కొత్త పరిచయాలతో పనులు నెరవేరుతాయి. కళాకారులకు అనుకూల సమయం.

**జ్యేష్ఠం:** కుటుంబంతో సంతోషంగా కాలం గడుపుతారు. నెలాఖరులో ఇంట్లో అనవసరమైన చర్చలతో వివాదాలు తలెత్తవచ్చు. సంయమనం పాటించడం అవసరం. వివాహాది శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. సమాజంలో గుర్తింపు లభిస్తుంది. విద్యార్థులకు అనుకూల సమయం.

**ఆషాఢం:** పనులు సకాలంలో పూర్తవుతాయి. ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులు అధికారులతో స్నేహంగా మసులుకుంటారు. పెద్దల సహకారం లభిస్తుంది. కొత్తగా పరిచయమైన వ్యక్తులతో పనులు నెరవేరుతాయి.

**శ్రావణం:** విద్యార్థులకు మంచి అవకాశాలు వస్తాయి. విదేశీ విద్యకు అవకాశం ఉంది. కొత్త ఉద్యోగంలో చేరుతారు. పనులు అనుకున్న సమయంలో పూర్తి కావడంతో ఆనందంగా ఉంటారు. సహోద్యోగులతో స్నేహం పెరుగుతుంది. వ్యాపారులు కొత్త ఒప్పందాలపై దృష్టి నిలుపుతారు.

**భాద్రపదం:** ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. ఉద్యోగులకు పనిభారం మూలంగా మనశ్శాంతి లోపించవచ్చు. వ్యాపారులు సమయానుకూల పెట్టుబడులతో లాభాలు గడిస్తారు. కోర్టు వ్యవహారాలు అనుకూలిస్తాయి. బంధు మిత్రులతో మనస్పర్ధలు తలెత్తవచ్చు. వివాదాలకు దూరంగా ఉండండి.

**ఆశ్వీయుజం:** ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది. ఆరోగ్యంపై మనసు నిలపడం అవసరం. విద్యార్థులు పట్టుదలతో శ్రమిస్తే మంచి ఫలితాలను పొందుతారు. అనవసరమైన ఆలోచనలను పక్కన పెట్టండి.

**కార్తీకం:** ఆదాయం పెరగడంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. ప్రారంభించిన పనులలో ఆటంకాలు ఎదురైనప్పటికీ సకాలంలో పూర్తవుతాయి. ఆస్తుల మూలంగా రాబడి పెరుగుతుంది. రుణబాధల నుంచి విముక్తులు అవుతారు.

**మార్గశిరం:** సమయానుకూల నిర్ణయాలతో మంచి ఫలితాలు పొందుతారు. నలుగురిలో గుర్తింపు లభిస్తుంది. తీర్థయాత్రలు, విహారయాత్రలు చేపడతారు. గృహ నిర్మాణ కార్యక్రమాలు కలిసి వస్తాయి.

**పుష్యం:** ఈ మాసంలో ఫలితాలు మిశ్రమంగా ఉంటాయి. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. అయితే రాబడిని దృష్టిలో పెట్టుకొని ఖర్చులను నియంత్రించడం అవసరం. నిరుద్యోగులకు ఉద్యోగ యోగం.

**మాఘం:** ఈ మాసంలో గ్రహస్థితి అనుకూలంగా ఉంది. వివాహాది శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబంతో సంతోషంగా ఉంటారు. సమయానుకూల నిర్ణయాలతో సత్ఫలితాలు పొందుతారు.

**ఫాల్గుణం:** ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తారు. ఖర్చుల నియంత్రణ అవసరం. విదేశీ ప్రయాణాలకు, పై చదువులకు అనుకూలం. భూములు, వాహనాల విషయంలో జాగ్రత్త అవసరం. కళాకారులకు మంచి అవకాశాలు వస్తాయి.

**** ఈ రాశివారికి గురువు రాజ్యంలో (ఏప్రిల్ 31 వరకు), సంవత్సరం పూర్తయ్యే దాకా లాభంలో ఉంటాడు. అష్టమం శని, భాగ్యంలో రాహువు, తృతీయంలో కేతువు సంచరిస్తారు. గురువు, రాహువు, కేతువు అనుకూల ఫలితాలు ఇస్తారు. శని చికాకులు కలిగిస్తాడు. శివారాధనతో శుభఫలితాలు పొందుతారు.***